
www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

గురువారం, 18-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :49 Issue : 49 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

# లాయర్ పాత్రలో కీర్తి సురేష్



8

ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం

# నామోషీ కాదు

ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది



- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు
- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు.

వివరాలు 2వ పేజీలో



# గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యం

3

- పైకప్పు మార్పునకు 2 లక్షల సాయం
- యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

రాష్ట్రంలో ఒక్క నిరుపేద కూడా గుడిసెలో ఉండకుండా, సొంతింటి కలను సాకారం చేస్తూ గుడిసెలు లేని తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



# తల్లీ, బిడ్డ మృతి

గుండాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

- వైద్యులు లేక నర్సుతో ప్రసవం
- తీవ్ర రక్తస్రావంతో బాలింత కన్నుమూత
- విచారణ జరపాలని కుటుంబసభ్యుల డిమాండ్

2

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రసవ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఒక నర్సు కాన్పు చేయగా.. చివరకు తల్లిబిడ్డా ఇద్దరూ మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందంటూ బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది.

# సాంకేతికతతో సాగుకు కొత్త దిశ

- 7 వరి రకాలకే ప్రాధాన్యం
- యూరియా యాప్ పనితీరుపై దీర్ఘ హర్షం
- శాటిలైట్ సాయంతో చీడపీడల గుర్తింపు
- ఖరీఫ్ సన్నద్ధతపై మంత్రి తుమ్మల సమీక్షలు




3

# సంక్షోభమే!

- కాంగ్రెస్ ది రాక్షస పాలన
- దండుపాళ్యం బ్యాచ్ లా మంత్రులు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2







# హైదరాబాద్‌కు టెస్లా!

మాదాపూర్ లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్

బొల్లారంలో డెలివరీ, సేవల కేంద్రం

2

# అభిమాని వద్దకు పవన్!

ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న నిరంజన్

ఇంటికెళ్లి పరామర్శించిన ఏపీ డిప్యూటీ సీఎం

వైద్యం కోసం 1,00,000 ఆర్థిక సాయం



2

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తన వీరాభిమాని నిరంజన్ ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. వరంగల్ జిల్లా హనుమకొండలోని ఆ బాలుడి ఇంటికి స్వయంగా వెళ్లి మనోధైర్యం కల్పించారు. వైద్య ఖర్చుల నిమిత్తం 1,00,000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.



# రోడ్డుకు ట్రంప్ పేరా?

- నియంతను గౌరవిస్తారా?.. బీజేపీ బాటలోనే కాంగ్రెస్ సర్కారు
- సీఎం నిర్ణయంపై ఎంఏ బేబీ ఫైర్

3

# నీట్.. బస్సు ఫ్రీ!

- విద్యార్థులకు హాల్ టికెటే పాస్
- ఈనెల 21న అవకాశం.. మంత్రి పొన్నం వెల్లడి
- ఆర్టీసీ బస్సులో మంత్రుల ప్రయాణం

3



# అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర

అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడి చేసేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ భగ్నం చేసింది.

6



# ఉగ్ర ముఠా గుట్టురట్టు

- ఏడుగురు అరెస్ట్..
- పుల్వామా తరహా కుట్ర కోణంలో దర్యాప్తు



6

# 30లోగా కేవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

- పూర్తి చేయకుంటే గ్యాస్ సబ్సిడీ కట్!
- గ్యాస్ వినియోగదారులకు కేంద్రం మెలిక



6

# హైదరాబాద్ కు టెస్లా!

**మాదాపూర్ లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్**

**బొల్లారంలో డెలివరీ, సేవల కేంద్రం**

**హైదరాబాద్:** ప్రముఖ విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా హైదరాబాద్ లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కు శ్రీకారం చుట్టింది. మాదాపూర్ హైటెక్ సిటీలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. బొల్లారం పారిశ్రామిక వాడలో కార్ల డెలివరీ, విక్రయానంతర సేవల కేంద్రాన్ని నెలకొల్పింది. దేశంలో టెస్లాకు ఇది 5వ కేంద్రం కావడం విశేషం. ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ లో కస్టమర్లు టెస్లా 2026 మోడల్ వై ప్రీమియం రేర్ వీల్ డ్రైవ్ తో పాటు మోడల్ వై ఎల్ వాహనాలను పరిశీలించవచ్చని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. టెస్లా కార్లలో వాడుతున్న అత్యాధునిక సాంకేతికత, భద్రతా ప్రమాణాలు, వాహన పనితీరును ఇక్కడ ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, గురుగ్రామ్ నగరాల్లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నెలకొల్పగా.. తాజాగా హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన కేంద్రంతో దేశంలో వీటి సంఖ్య 5కు చేరింది.

# రైతుకే పెద్దపీట!

**పేదలకు సన్నబియ్యం.. లాభదాయక వ్యవసాయమే లక్ష్యం**

**బాయిల్డ్ రైస్ కొనని ఎఫ్ సీఐ: సబ్ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదలు సన్నబియ్యం తినాలి, రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ విధానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ రైతాంగం అడుగులు వేసేలా, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. నాణ్యమైన వరి సాగుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. తెలంగాణ సోనా, బీపీటీ 5204, జై శ్రీరామ్, హెచ్ఎంటీ తదితర సన్న రకాలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వీటిని సాగు చేసేలా చూడాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ రకాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించింది. రాబోయే సీజన్ లో వీటిని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి ప్రయోజనం చేకూరుతుందని సబ్ కమిటీకి నివేదించింది.

**కేంద్రం తీరుపై ఆందోళన..**

ఎఫ్ సీఐ ధాన్యం కొనుగోళ్లు తగ్గిస్తూ రాష్ట్రానికి ఇబ్బందులు సృష్టిస్తోందని వ్యవసాయ కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తల్లీ, బిడ్డ మృతి

**గుండాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం**

**వైద్యులు లేక నర్సుతో ప్రసవం**

**తీవ్ర రక్తస్రావంతో బాలింత కన్నుమూత**

**విచారణ జరపాలని కుటుంబసభ్యుల డిమాండ్**




**కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రసవ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఒక నర్సు కాన్పు చేయగా.. చివరకు తల్లిబిడ్డా ఇద్దరూ మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందంటూ బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. గుండాల మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన 20 ఏళ్ల గర్భిణి వనజకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ వైద్యులెవరూ అందుబాటులో లేకపోవడంతో డ్యూటీలో ఉన్న నర్సు సాధారణ ప్రసవం చేసింది. కాన్పు అయిన వెంటనే శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కంగారుపడిన బంధువులు ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే నవజాత శిశువు మరణించినట్లు నిర్ధారించారు.

**బాలింత కూడా మృతి..**

మరోవైపు కాన్పు తర్వాత తల్లి వనజకు తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె కూడా కన్నుమూసింది. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల బాధ్యతారాహిత్యం వల్లే తమ కుమార్తె, మనవడు ప్రాణాలు కోల్పోయారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

- ఆ భావన నుంచి బయటపడితే మంచిది
- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు
- అందరికీ విద్య లక్ష్యంగా పబ్లిక్ స్కూల్
- కులమాతలకు అతీతంగా విద్య
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి,జూన్17:** ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రమంతా సంక్షోభమే!

- కాంగ్రెస్ ది రాక్షస పాలన
- మంత్రులు దండుపాళ్యం బ్యాచ్ లా తయారయ్యారు
- మళ్లీ బీఆర్ఎస్ దే అధికారం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఖమ్మం:** రాష్ట్రంలో ఎక్కడ చూసినా కూల్చివేతలే కనిపిస్తున్నాయని, సంక్షేమం లేదని అంతా సంక్షోభమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్ లా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు సైతం తీసిపోవడం లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ బీఆర్ఎస్ దే అధికారమని, కేసీఆర్ తిరిగి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవల్ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని, దండుపాళ్యం ముఠాకు ఆయన అధ్యక్షుడైతే.. మంత్రులు ఆయన్ను మించిపోయారని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దులు లేకుండా పోయిందని, ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు దాచుకోవడం, దోచుకోవడం తప్ప జిల్లాకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఒక మంత్రి భూ కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని, ఆర్థిక మంత్రి రాష్ట్ర పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని, ఆయన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు.

**నిజాయతీగా ఎన్నికలు జరిగితే..**

నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ కచ్చితంగా వంద సీట్లతో గెలుస్తారని, అలా జరగాలంటే కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు ఓటర్ల సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం జరుగుతుందని, ఇందులో కచ్చితంగా పాల్గొని పార్టీకి నష్టం జరగకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండన్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పు చేసి ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, కానీ కేసీఆర్ తెచ్చిన అప్పులతో కాళేశ్వరం, భక్తరామదాసు లాంటి ప్రాజెక్టులతో పాటు మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అభిమాని వద్దకు పవన్!

- ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న నిరంజన్
- ఇంటికెళ్లి పరామర్శించిన ఏపీ డిప్యూటీ సీఎం
- వైద్యం కోసం 1,00,000 ఆర్థిక సాయం
- భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వైనం



**వరంగల్:** ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తన వీరాభిమాని నిరంజన్ ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. వరంగల్ జిల్లా హనుమకొండలోని ఆ బాలుడి ఇంటికి స్వయంగా వెళ్లి మనోధైర్యం కల్పించారు. వైద్య ఖర్చుల నిమిత్తం 1,00,000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. జన్యుపరమైన వ్యాధితో పోరాడుతున్న 17 ఏళ్ల నిరంజన్ కు పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచి అమితమైన ఇష్టం. తన ఆరాధ్య నాయకుడిని చూడాలన్న బాలుడి కోరిక తెలుసుకున్న పవన్ బుధవారం నేరుగా వారింటికి వెళ్లారు. నిరంజన్ ను హత్తుకుని ముద్దాడారు. బాలుడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు తన పాటలకు వేసిన డ్యాన్స్ వీడియోలను చూసి చలించిపోయారు. తిరుమల నుంచి తెప్పించిన ప్రసాదంతో పాటు భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందించారు.

**కుక్కపిల్ల కొనిస్తానని హామీ..**

తనకు ఓ కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. ఇంటి యజమానిని స్వయంగా పిలిపించి పెంపుడు జంతువుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బాలుడి తల్లిదండ్రుల ఉపాధి కోసం వారికి ఓ క్యాంటీన్ ఏర్పాటు చేయించాలని స్థానిక జనసేన నేతలను ఆదేశించారు.

**సహకరించిన వారికి కృతజ్ఞతలు..**

తన పరామర్శకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు శాఖకు పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. నిరంజన్ ధైర్యం అతడి కష్టాల కంటే గొప్పదని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల ప్రేమను జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని పేర్కొన్నారు. అనంతరం వరంగల్ భద్రకాళి అమ్మవారిని పవన్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కే సాగర్ పాల్గొన్నారు.

# గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

- ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యం
- పైకప్పు మార్పునకు 2 లక్షల సాయం
- యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయి సర్వే
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్:** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కూడా గుడిసెలో ఉండకుండా, సొంతింటి కలను సాకారం చేస్తూ గుడిసెలు లేని తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న గుడిసెలను గుర్తించేందుకు యుద్ధప్రాతిపదికన సమగ్ర సర్వే చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రజాపాలనలో 75,000 మంది గుడిసె వాసులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను తేల్చాలన్నారు. దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు..

రెండో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి సర్కారు నిర్ణయం తీసుకుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున పారదర్శకంగా మంజూరు చేయనున్నారు. లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకునే బీఎల్సీ విధానంలో అవకాశం కల్పించడంతో పాటు, పట్టణాల్లో స్థలాల కొరత ఉంటే గ్రౌండ్ ప్లస్ 1 నిర్మాణాలకు కూడా అనుమతి ఇస్తామని మంత్రి వెల్లడించారు.

### పైకప్పు మార్పునకు 2 లక్షలు..

గుడిసెలు, రేకులు, నాపరాళ్లు, టార్పాలిన్ షీట్ల కింద నివసిస్తున్న పేదల భద్రత కోసం రూఫ్ రీప్లేస్ మెంట్ పథకం కింద స్లాబ్ వేసుకునేందుకు 2 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 50,000 ఇళ్లను దీనికింద ఎంపిక చేస్తారు. గతంలో ఇందిరమ్మ, గృహలక్ష్మి పథకాల్లో మంజూరై బేస్ మెంట్ లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన అసంపూర్తి ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పొంగులేటి స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీ తేడా లేకుండా పూర్తి పారదర్శకతతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# సాంకేతికతతో సాగుకు కొత్త దిశ

- 7 వరి రకాలకే ప్రాధాన్యం
- యూరియా యాప్ పనితీరుపై డీలర్ల హర్షం
- శాటిలైట్ సాయంతో చీడపీడల గుర్తింపు
- ఖరీఫ్ సన్నద్ధతపై మంత్రి తుమ్మల సమీక్షలు



**హైదరాబాద్:** ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దిశానిర్దేశం నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సచివాలయంలో వరుస సమీక్షలు నిర్వహించారు. విత్తన కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, కృషి వాస్ ప్రతినిధులతో విడివిడిగా సమావేశమై ఖరీఫ్ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. మార్కెట్ డిమాండ్, మిల్లర్ల సూచనలు, ఎగుమతుల అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 వరి రకాల విత్తనాల లభ్యతపై మంత్రి సమీక్షించారు. బీపీటీ-5204 (సాంబమసూరి), ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోన), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-7715 రకాల విత్తనాలను రైతులకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో దొడ్డు రకాల సాగు 60 శాతం, సన్న రకాల సాగు 40 శాతం ఉండేదని.. సన్నాలకు ప్రభుత్వం బోనస్ ప్రకటించిన తర్వాత సన్న రకాల సాగు 60 శాతానికి చేరిందని వివరించారు. రైతులు ఏ రకం విత్తనాన్ని ఎంత కొనుగోలు చేశారో ప్రభుత్వానికి నివేదించాలని, విత్తన నిల్వలను డీలర్లు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. విత్తన సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు.

### యూరియా యాప్ అదుర్స్..

ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై ఫెర్టిలైజర్ డీలర్లతో మంత్రి చర్చించారు. ఎరువుల సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దేశంలోనే తొలిసారిగా సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం యాప్ రూపొందించిందని, ఈ విధానాన్ని కేంద్రంతో పాటు ఇతర రాష్ట్రాలు కూడా ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయని తెలిపారు. సాంకేతికతను వినియోగించి సరైన రైతుకు, సరైన పరిమాణంలో యూరియా అందించడమే తమ లక్ష్యమన్నారు. యాప్ రాకతో రద్దీ సమస్య తగ్గిందని, రైతులు తమకు అనుకూలమైన సమయంలో వచ్చి ఎరువులు కొనుగోలు చేస్తున్నారని డీలర్లు మంత్రి దృష్టికి తెచ్చారు.

### శాటిలైట్ తో వ్యాధుల గుర్తింపు..

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై కృషి వాస్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్షించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా పంటల్లో చీడపీడలను అప్పటికప్పుడే గుర్తించి, అవి విస్తరించకముందే రైతులకు సమాచారం అందించేలా ఈ ప్రాజెక్టు పనిచేస్తుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. దీనిద్వారా రైతులు పొలాల్లో తిరిగి వ్యాధులను గుర్తించాల్సిన అవసరం తప్పుతుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలాన్ని ఈ ప్రాజెక్టు పైలట్ అమలుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సేవలతో లబ్ధి పొందిన అంకంపాలెం రైతు వీరభద్రరావుకు మంత్రి స్వయంగా ఫోన్ చేసి ప్రాజెక్టు ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచంలోని ఉత్తమ సాంకేతికతను మన రైతులకు అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సంచాలకులు బి గోపి, మార్క్ ఫెడ్ ఎండీ రాహుల్ రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ యాస్మిన్ బాషా, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య పాల్గొన్నారు.

# ఎల్ఐసీకి ఏజెంట్లే మూలస్తంభం!

- నాగోల్ లో ఘనంగా లియాఫీ 18వ జనరల్ కౌన్సిల్ సమావేశాలు
- ఏజెంట్లు, పాలసీదారుల హక్కుల పరిరక్షణే ప్రధాన ధ్యేయం
- దేశవ్యాప్తంగా తరలివచ్చిన 3,000 మందికి పైగా ప్రతినిధులు
- భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ, తీర్మానాల ఆమోదం



**రంగారెడ్డి:** జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి ఏజెంట్లే మూలస్తంభాలని, వారి హక్కుల పరిరక్షణతో పాటు బీమా రంగ సమగ్ర అభివృద్ధికి లియాఫీ కట్టుబడి ఉందని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ-1964) 18వ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ లోని శుభం కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 17, 18 తేదీల్లో నిర్వహించే ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 3,000 మందికి పైగా జనరల్ కౌన్సిల్ సభ్యులు, జాతీయ కార్యవర్గ ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, బీమా ఏజెంట్లు తరలివచ్చారు.



సమావేశాల ప్రారంభం సందర్భంగా లియాఫీ జాతీయ అధ్యక్షుడు శ్యామల చక్రవర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్యామల చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశాలకు ముఖ్య అతిథులుగా రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి ముల్లూరి లక్ష్మణ్, ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ సేర్వన రమేష్, హైదరాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె సంధ్యారాణి, సికింద్రాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాస్ కుమార్ సాహూ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### సవాళ్లపై సుదీర్ఘ చర్చ..

జీవిత బీమా ఏజెంట్లు, పాలసీదారులకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు లియాఫీ జాతీయ అధ్యక్షుడు శ్యామల చక్రవర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి తెలిపారు. బీమా రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఏజెన్సీ వ్యవస్థ బలోపేతం, పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణ, ఏజెంట్ల సంక్షేమం, బీమా సేవల్లో డిజిటల్ రూపాంతరం, దేశవ్యాప్తంగా బీమా విస్తరణ పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

### కీలక తీర్మానాలకు ఆమోదం..

ఈ సందర్భంగా సంస్థ సీనియర్ నాయకులు సభ్యత్వ విస్తరణ, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి చేసిన వినతులపై నివేదికలను సమర్పించారు. ఫెడరేషన్ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో లియాఫీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం ఎస్ మూర్తి, జాతీయ కోశాధికారి బి శ్రీరామ్, రాజ్యాంగ కమిటీ చైర్మన్ బి ఎన్ చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగరాపు శ్రీనివాస్, పత్రికా ప్రచార కమిటీ చైర్మన్ షేక్ షాజహాన్, కో చైర్మన్ కె పాపయ్య నాయుడు, సురేష్ బాబు, సభ్యులు జన్నపల్లి శ్రీనివాసరెడ్డి, గడ్డం సత్యనారాయణ, భాస్కర్, శ్రీధర్, నవనీత్, కరుణ, రజిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు ట్రంప్ పేరా?

### నియంతను గౌరవిస్తారా?.. బీజేపీ బాటలోనే కాంగ్రెస్ సర్కారు

### సీఎం నిర్ణయంపై ఎంఏ బేబీ ఫైర్



**న్యూఢిల్లీ:** హైదరాబాద్ లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సీపీఎం నేత ఎంఏ బేబీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక నియంత పేరును ఆ రోడ్డుకు పెట్టడం సరికాదని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం చేస్తున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక నేత హోచిమిన్ పేరును కోల్ కతాలోని అమెరికా కాన్సులేట్ వెలుపల ఉన్న రోడ్డుకు పెట్టారని ఎంఏ బేబీ గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం అమెరికా ఇరాన్ పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దారుణాలకు ఒడిగడుతూ సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్ లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్ ను గౌరవిస్తూ రోడ్డుకు ఆయన పేరు పెట్టడం ఏమాత్రం సబబు కాదన్నారు.

### బీజేపీ బాటలోనే కాంగ్రెస్..

ఇటీవల అమెరికా సైన్యం వాణిజ్య నౌకపై దాడి చేసి 3 భారతీయ నావికులను హతమార్చిందని ఎంఏ బేబీ ఆరోపించారు. ఇలాంటి దాడులను కొనసాగిస్తామని అమెరికా బెదిరిస్తున్నప్పటికీ భారత ప్రభుత్వం కనీస నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్పందించలేదన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకునేందుకు బీజేపీకి ఎటువంటి సంకోచం లేదని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. వివాదాస్పద నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కాంగ్రెస్ అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసే తీర్మానాలు మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని ఆయన సూచించారు.

# నీట్.. బస్సు ఫ్రీ!

### విద్యార్థులకు హాల్ టికెటే పాస్.. ఈనెల 21న అవకాశం

### మంత్రి పొన్నం వెల్లడి.. ఆర్టీసీ బస్సులో మంత్రుల ప్రయాణం



**కరీంనగర్:** ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఎక్కడికైనా ఉచితంగా వెళ్లవచ్చని స్పష్టం చేశారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే వారిని ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్యను పెంచామని, కార్మికులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. ఆర్టీసీ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# ఓట్ల తొలగింపునకు కుట్ర!

### ఎస్ఐఆర్ ప్రక్రియతో ముస్లిం ఓట్లకే ఎసరు

### బెంగాల్, బీహార్ రాష్ట్రాలే నిదర్శనం.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### మంత్రి అజారుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్:** సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా తెలంగాణలో ముస్లిం ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని మంత్రి అజారుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ముస్లింల ఓట్లు తొలగించే బీజేపీ అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలోనూ అలాంటి ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటును కాపాడుకోవాలని ఆయన హెచ్చరించారు. బుధవారం గాంధీభవన్ లో మీడియాతో అజారుద్దీన్ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల తొలగింపుపైనే ఎన్నికల్లో గెలుపోటములు ఆధారపడి ఉంటాయన్నారు. ఇక తన భాషపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ.. తనకు తెలుగు చదవడం, రాయడం వచ్చని, కానీ మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లుతాయన్న ఇబ్బందితోనే తనకు సులభంగా ఉండే భాషలో మాట్లాడుతున్నానని వివరించారు.

### ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లిస్తున్నాం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అద్భుతమైన పాలన సాగుతోందని అజారుద్దీన్ ప్రశంసించారు. గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని గుర్తుచేశారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రచారం చేసుకోకుండా 200 మందికి పైగా పేదలకు సాయం చేశానని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని ఆయన వెల్లడించారు.

# చిట్యాల జడ్.పి.హెచ్.ఎస్ గణిత ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

**ఆశ్వి అప్డేట్స్ : చిట్యాల**



నల్గొండ జిల్లా చిట్యాల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకులు (నల్లగొండ జిల్లా తెలంగాణ సాహితి ఉపాధ్యక్షులు) దాసరి శ్రీరాములు తన చదువుల తల్లిపై ఉన్న మక్కువను చాటుకున్నారు. తాను బాల్యంలో చదివిన చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు, తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన "దాసరి సత్తమ్మ సాయిలు విద్యా, సాహిత్య సహకార సంస్థ" తరఫున ఈ ఏడాది కూడా రూ. 6,100/ల నగదు బహుమతులను అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన పేదరికాన్ని జయించడానికి ఈ ప్రభుత్వ బడిలో నేర్చుకున్న చదువే కారణమన్నారు. సమాజాన్ని, దేశాన్ని మార్చే శక్తి చదువుకు మాత్రమే ఉందని, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన గణితశాస్త్రాన్ని ఇష్టపడి చదవాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు

పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుశీల మాట్లాడుతూ ఇదే బడిలో చదివిన శ్రీరాములు గారు నేడు విద్యార్థులను ప్రోత్సహించే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. నగదు బహుమతులు పొందిన విద్యార్థులు: జి. సంకీర్తన, ఎండి. షాహిన్, బి. పూజ, ఎస్కే. యాస్మిన్, పి. శిరీష. ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు చిలకరాజు శ్రీనివాస్, కోణం శ్రీనివాస్, ఎ. పద్మజ, ఎ. కవిత, ఎన్. సైదులు, చ. ప్రసన్న, జి. శైలజ, జె. మంజుల, ఎండి. సాదిక్, ఎం. జానకి, ఎం. సౌమ్య తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తుకై పాటుపడుతున్న దాత దాసరి శ్రీరాములు కు పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

## లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం

- **రాజీయే రాజమార్గం.. మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.**

**అశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 17**



ఈ నెల 20వ తేదీ శనివారం రోజు నారాయణ పేట, కోస్గి , మక్తల్ కోర్టులలో నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS కోరారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ మరియు వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీయే రాజమార్గం అని పేర్కొంటూ, న్యాయ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు.

జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసుల్లో రాజీ కావాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను ముగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్న కిష్టాపూర్ గ్రామ శివారులో జరగబోతున్న ఒక బాల్య వివాహాన్ని రెవిన్యూ, పోలీస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు సకాలంలో స్పందించి అడ్డుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తొగుట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన రాజేష్, కమలమ్మల కుమార్తె అనిత (15) ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. ఈ కుటుంబం ప్రస్తుతం చిన్న కిష్టాపూర్‌లో నివాసం ఉంటోంది. కాగా, ఈ బాలికకు హైదరాబాద్ నాగోల్ ప్రాంతానికి చెందిన తిమోతి అనే యువకుడితో గ్రామ శివారులోని ఒక మామిడి తోటలో పాస్టర్ సమక్షంలో వివాహం జరిపించేందుకు పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ బాల్య వివాహంపై ముందస్తు సమాచారం అందుకున్న స్థానిక తహశీల్దార్ డి. సుజాత, కుకునూరుపల్లి ఎస్ఐ పి. శ్రీనివాస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మైనర్ బాలికలకు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను ఇరువర్గాల తల్లిదండ్రులకు వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వివాహాన్ని నిలిపివేసి, బాలిక రక్షణ నిమిత్తం ఆమెను మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. సమయానికి స్పందించి బాలిక భవిష్యత్తును కాపాడిన అధికారులను గ్రామస్థులు అభినందించారు.

## తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్న ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి,డాక్టర్ పి జే బాబు

**దేవరకద్ర జూన్ 17 ( అశ్విఅప్డేట్స్);**



తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి నీ బుధవారం తెల్లవారుజామున తిరుమల శ్రీ. వెంకటేశ్వర స్వామి వారిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి , డాక్టర్ పీజే బాబు తో పాటు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. వారిని ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయ ప్రకారంగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## ప్రజా పాలనలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు: కవిత మధుసూదన్ రెడ్డి.

**దేవరకద్ర అడ్డాకుల జూన్ 17 ( అశ్వి అప్డేట్స్);**



అడ్డాకల్ మండలం వర్నె గ్రామంలో గురమోని శిరీష చంద్రయుడు నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి ముఖ్య అతిథిగా కవిత మధుసూదన్ రెడ్డి పాల్గొ ని ఇందిరమ్మ గృహ ప్రవేశంలో పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన తీసుకురావడం వల్ల అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే సొంత ఇంటి కల సహకారమైందని అన్నారు.కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డును వెంటనే పూర్తీ చేయాలనీ రాస్తారోకో


- **ఎమ్మెల్యే హామీతో రాస్తారోకో విరమించిన మాస్ లైన్ నాయకత్వం**
- **సీపీఐ(ఎమ్ ఎల్)మాస్ లైన్.**

**అశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 17**

అప్పక్ పల్లి కోటకొండ కోయిల్ కొండ అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేట అంబేద్కర్ చౌక్ లో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ అధ్యక్షత వహించగా సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి రోడ్డు పెండింగ్లో ఉన్నది ఆ ప్రాంతంలో వివిధ గ్రామాలకు వెళ్లే వాహనాఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో చుట్టుపక్కల గ్రామాలలోని రైతులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. సమయానికి సరైన వైద్యం అందకపోవడం మూలంగా రోడ్డు మీదనే ప్రసవాలు జరిగిన చరిత్ర ఉన్నది. పాసింజర్ ఆటోలు బోల్తా పడిన సందర్భం ఉన్నది. ద్విచక్ర వాహన దారులు ఆసుపత్రిపాలయ్యారు నడుము కాళ్ళు చేతులు విరిగిన చరిత్ర ఉన్నది అన్నారు .గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పూర్తీ చేయలేదు. అధికారం లోకి వచ్చి మూడు యేళ్లు కావొస్తున్న కూడ కాంగ్రెస్ చేయడం లేదు ఇందుకు ప్రభుత్వాలు సిగ్గుపడాలి అన్నారు. అన్నీ మా నుండి వస్తున్నాయి, కేంద్రం నుండి అని బిజెపి నాయకత్వం పదేపదే మాట్లాడుతుంటారు. ఈ ప్రాంత ఎంపీ డీకే అరుణ గారైన కల్పించుకోవాలి. కేంద్ర నిధులనుండైనా రోడ్డుని పూర్తి చేయాలి. ఎన్నికలప్పుడు ప్రగల్బాలు పలికిన ఈ నాయకులు తరువాత మర్చిపోతారాన్నారు. ఈ రొడ్డుకోసం గత నాలుగు ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా కూడ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం చలించడం లేదన్నారు. అధికారులు నాయకులు ఒకరిపై ఒకరు బొంకుతూ సమయం దాటవేస్తున్నారు అన్నారు. పనులు చేద్దాం అని ఎవరైనా ముందుకు వాస్తే ముదుపులకోసం వేధిస్తున్నారు అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి వెంటనే పూర్తి చేయాలనీ లేనిచో ప్రజాగ్రహానికి గురికావలసి వస్తుందనీ హెచ్చరించారు.

పోలీసుల అత్యుత్సాహం

శాంతియుతంగా కార్యక్రమం చేస్తున్న నాయకులను అరెస్టు చేసే ప్రయత్నం చేశారు పార్టీ కార్యకర్తలు ప్రజలు ప్రతిఘటించడంతో అరెస్టులు విరమించుకున్నారు. అయినప్పటికీ దాదాపు 50 మందిని అరెస్టు చేసి దామర్ గిద్ద పోలీస్ స్టేషన్ కు తరలించారు. అదేరోజు సాయంత్రం వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని రాస్తారోకోను జయప్రదం చేశారు.







## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హెచ్‌సీఏ కార్యదర్శి మన్నే జీవన్ రెడ్డి

- **టీజీ20 ఆరంభ వేడుకల ఆహ్వాన పత్రిక అందజేత**

**ఆశ్వి అప్డేట్స్ హైదరాబాద్, జూన్ 17, 2026 :**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 21న నుంచి చారిత్రక టీజీ20 లీగ్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఆరంభ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని జీవన్ రెడ్డి ఆహ్వానించారు. టీజీ20 టోర్నమెంట్, ఫ్రాంఛైజీలు, పోటీపడుతున్న క్రీడాకారులు, జిల్లా క్రికెటర్ల ప్రాతినిథ్యం వంటి అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించిన జీవన్‌రెడ్డి లీగ్ ఆరంభ వేడుకల ఆహ్వాన పత్రికను ఆయనకు అందించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండి సోనీబాలా దేవి, హెచ్‌సీఏ కోశాధికారి అనిల్ కుమార్, అపెక్స్ కౌన్సిల్ కౌన్సిలర్ సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.



## గర్ల్స్ హాస్టల్లో తనిఖీ చేసిన ఎం పి డి ఓ

**ఆశ్వి అప్డేట్స్ యాదాద్రి భువనగిరి :**

వలిగొండ మండల కేంద్రంలో లోతుకుంట హాస్టల్‌ను బుధవారం రోజు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ జి. జలందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను పరిశీలించి వాటి నిర్వహణపై ఆరా తీశారు. అలాగే హాస్టల్ ప్రాంగణంలోని పరిశుభ్రత, స్టోర్ రూములు, తరగతి గదులు మరియు ఇతర మౌలిక వసతులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు.

హాస్టల్‌లో ఇటీవల చేరిన కొత్త విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నార్కట్ పల్లి నూతన సీఐగా సిరికొండ సురేష్ బాధ్యతల స్వీకరణ

**ఆశ్వి అప్డేట్స్ : నార్కట్ పల్లి**



నల్గొండ జిల్లా నార్కట్ పల్లి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గా సిరికొండ సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు నల్గొండ స్పెషల్ బ్రాంచ్ 2 సీఐగా విధులు నిర్వహించిన ఆయన, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నార్కట్ పల్లి సర్కిల్ బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కైగురి నాగరాజు హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో సురేష్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన సీఐ సిరికొండ సురేష్ మాట్లాడుతూ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకమైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన సీఐకి పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు మరియు విలేకరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



## 20న చలో మహబూబ్ నగర్

**దేవరకద్ర, అమరచింత జూన్ 17 ( అశ్వి అప్డేట్స్ );**

అమరచింతమండలంలోని . కొంకాని వాని పల్లి, పామిరెడ్డి పల్లి, ఉపాధి పనులవద్ద కూలీలకు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, యస్, అజయ్, అమరచింత మండలఅధ్యక్షులు కె. శంకర్ లు మాట్లాడుతు తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభ లు ఈ నెల 20.21.22. తేదీలలో మహబూబ్ నగర్ పట్టణం జరుగుతాయని,20న జరిగే బహిరంగ సభ కు ముఖ్య అతితి గా త్రిపుర మాజీ ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్, కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని విరభద్రం. కెవి, పి ఎస్ రాష్ట్రఅధ్యక్షులు జాన్ వెస్లీ అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి, వెంకట్ శివ దాసన్, ఎంపీ లు హాజరు అవుతున్నారని తెలిపారు.

## సామాన్యులు ఫిర్యాదు చేస్తే న్యాయం జరగదని మరొకసారి నిరూపించిన నారాయణపేట మున్సిపల్ అధికారులు

**అశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 17**




స్థానిక నారాయణపేట పట్టణంలోని బాహర్ పేట వీధిలో గల 12 వార్డులో ఇంటి నెంబర్ 3.8.36 కోర్టులో కేసు నడుస్తున్నందువలన (భాగ పరిష్కారం కొరకు) ఇంటి నిర్మాణ పనులు ఆపి ఇందిరమ్మ బిల్లు నిలిపివేయాలని ఎర్ర గొల్ల గోవిందమ్మ రెండుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదు వలన కొన్ని రోజులు పని నిలిపివేసినారు తర్వాత వార్డు ఆఫీసర్ అయినా రవీందర్ ఫిర్యాదు దారునికి వ్యతిరేకంగా ఫస్ట్ లెవెల్ బేస్మెంట్ బిల్లుకు ఫోటోలు తీయడం జరిగింది దీనిపై విచారణ గారికి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని 25.05.2026 రోజు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. దీని వలన ఇంటి నిర్మాణ పనులు ఆపివేసినారు మళ్ళీ ఇప్పుడు 17.06.2026 రోజు ఇంటి నిర్మాణ పనులు చేపట్టినారు దీనిపై మున్సిపల్ అధికారుల అండదండలతోనే పనులను ప్రారంభించడం జరిగింది. మున్సిపల్ అధికారులు సామాన్య ప్రజలకు ఒకలా అధికార అండదండలు ఉన్నవారికి ఒకలా న్యాయం చేయడం ఏమిటని (ఇలాంటి విషయంలో 13 వార్డులో కూడా సదా పేపర్ పై ఫిర్యాదు చేస్తే ఇంటి నిర్మాణ పనులు ఆపి, ఇందిరమ్మ బిల్లు రాకుండా చేసి వాళ్లకు అనుకూలంగా పని అయ్యేంతవరకు పనిని నిలిపివేసినారు వాళ్ళు అనుకున్న విధంగా పని అయినప్పుడే వాళ్ళు చేసిన ఫిర్యాదును వెనకకు తీసుకోవడం జరిగింది. ) ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది.న్యాయవ్యవస్థలో ఇంకా తీర్పురానటువంటి కేసు ఉన్నందున ఇలాంటి చర్యలు జరగడం వలన న్యాయ వ్యవస్థను అపహాస్యం చేసేలా అధికారులు విధులను నిర్వర్తించడం ఎంతవరకు సమంజసం అని దీనిపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం జరిగేలా చూడాలని పత్రికాముఖంగా కలెక్టర్ గారికి కన్నీటి పర్యంతం తో వేడుకోవడం జరిగింది.



## పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన పుట్ట అరుణ చంద్ర మౌళి

**దేవరకద్ర జూన్ 17 ( అశ్వి అప్డేట్స్):**

దేవరకద్ర మున్సిపాలిటీ బలుసుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు పూనర్ ప్రారంభం కావడంతో బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా 10 వ వార్డు కౌన్సిలర్ పుట్ట అరుణ చంద్రమౌళి పాల్గొని విద్యార్థి, విద్యార్థినీలకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్య బోధన అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కాల్పుడ్ టీచర్స్ కనుక అంకిత భావంతో పని చేయాలి అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## ఆదాయానికి మించిన ఆస్తులు.. డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఏసీబీ దాడులు..!

**ఆశ్వి అప్డేట్స్**

హైదరాబాద్‌లో అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు భారీగా సోదాలు చేపడుతున్నారు. మల్టీ జోన్2లో ల్యాండ్ అండ్ సర్వే విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నరహరిపై ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం నుంచి హైదరాబాద్ లోని ఆయన నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహిస్తున్నారు. ఛత్రినాక ప్రాంతంలోని నరహరి నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. నరహరి నివసిస్తున్న మొదటి అంతస్తుతో పాటు కింది అంతస్తులో నివసిస్తున్న ఆయన సోదరుడి ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టారు. అంతేకాకుండా నరహరి కార్యాలయం, బంధువుల ఇళ్లు సహా మొత్తం 10 ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తున్నారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఈ తనిఖీలు చేపడుతున్నాయి. ఇద్దరు డీఎస్పీల పర్యవేక్షణలో సుమారు 10 బృందాలు వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం నరహరి, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండగా, అధికారులు వారికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నారు. సోదాల సందర్భంగా ఇప్పటికే కొన్ని కీలక పత్రాలతో పాటు బంగారం, ఇతర విలువైన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నరహరిని కూడా ప్రశ్నిస్తూ ఆయన ఆస్తుల మూలాలపై వివరణలు తీసుకుంటున్నారు. గత కొన్ని నెలలుగా నరహరిపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల ఆధారంగా ఏసీబీ అధికారులు ప్రత్యేక దర్యాప్తు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన ఆస్తుల వివరాలను గుర్తించిన అనంతరం ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు జరిగిన తనిఖీల్లో భారీ మొత్తంలో ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. అయితే పూర్తి వివరాలు సోదాలు ముగిసిన తర్వాత అధికారికంగా వెల్లడయ్యే అవకాశం ఉంది.

## సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాలపై క్లారిటీ..

**ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ ఏడాది (2026) నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్ వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ (ఆదివారం) సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం (ఎదురుకోలు) కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం, జాతరలో అత్యంత కీలకమైన ప్రధాన బోనాల ఉత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ (ఆదివారం) తెల్లవారుజామున 4:00 గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఆ రోజంతా లక్షలాది మంది మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ (సోమవారం) ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

# జీతాలు రాక ఇబ్బంది పడుతున్న 108 అంబులెన్స్ ఉద్యోగులు

- **ప్రభుత్వం నిధులు విడుదలలో జప్యం**
- **రెండు నెలలు కావస్తున్న 108సిబ్బందికి వేతనాలు కరువు**
- **ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి- 108ఉద్యోగులు**

**అశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 17**




నారాయణపేట జిల్లా: ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా లో ఆపదలో ప్రతి ఒక్కరికి మొదట గుర్తొచ్చే108 వాహనం అలాంటి వాహనంలో పనిచేస్తున్న ఉద్యోగులకే ఆపద కాలం వచ్చింది. కాల్ చేసిన 15 నిమిషాల లోపల సంఘటన స్థలానికి చేరుకొని ఎంతోమందికి వైద్య సహాయాన్ని అందిస్తూ ఆపద్బాంధవులుగా 108 సిబ్బందికి పేరు ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్లు మొత్తం 71 ఉన్నాయి. దాదాపుగా 300 మంది వరకు సిబ్బంది ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 108 ఉద్యోగులకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్లకు రెండు నెలల నుండి జీతాలు లేక ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనెల 15వ తేదీ నుండి పాఠశాలలో పునః ప్రారంభం కావడంతో తమ పిల్లలకు స్కూల్ ఫీజు లు పుస్తకాలు స్కూల్ యూనిఫామ్ కూడా డబ్బులు చెల్లించలేని స్థితిలో ఉన్నామని పలు ఉద్యోగు లు మానసిక క్షోభకు గురవుతున్నారు. గత కొంతకాలంగా ప్రభుత్వం నుండి నిధులు సకాలంలో విడుదల కాకపోవడం వలన సిబ్బందికి జీతభత్యాలు ఇవ్వడం కష్టంగా ఉంది. ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు రాకపోయినా సర్వీస్ లకు ఎటువంటి ఆటంకం లేకుండా వైద్య సేవలను అందిస్తున్నారు ఇటు ప్రభుత్వం సకాలంలో 108 కు బడ్జెట్ విడుదల చేయకపోవడంతో పలు వాహనాల్లో పనిచేసే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.ఒకవేళ ఇలాగే కంటిన్యూ అవుతే సిబ్బంది మొదట నిరసనతో తమ ఆందోళన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఇకనైనా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాలని పలు ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి కోరుతున్నారు. ప్రతినెల ఒకటో తారీఖున జీతాలు వచ్చే విధంగా చూడగలరని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు

# ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర భగ్నం

- **నల్లగొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసును ఛేదించిన జిల్లా పోలీసులు**
- **ఇద్దరు నిందితుల అరెస్టు – కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం**
- **సీసీటీవీ ఆధారాలతో నిందితులను గుర్తించిన నల్లగొండ పోలీసులు .**
- **జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్**




**ఆశ్వి అప్డేట్స్ నల్లగొండ జూన్ 17:**

నల్లగొండ పట్టణంలో జూన్ 6వ తేదీ తెల్లవారుజామున చోటుచేసుకున్న ఎన్టీఆర్ విగ్రహం దహనం ఘటనను నల్లగొండ టూ టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సామాజిక ఉద్రిక్తతలను సృష్టించాలనే ఉద్దేశంతో ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వెల్లడించారు.

నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఎన్.జి. కళాశాల సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై మున్సిపల్ 48వ వార్డు అధికారి బుజునూరి స్వప్న ఫిర్యాదు మేరకు నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నం.232/2026 కింద BNS సెక్షన్లు 326(F), 196, 126(2), 324(4), 292 మరియు PDPP Act1984 సెక్షన్4 ప్రకారం నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. నల్లగొండ సీసీఎస్, టూ టౌన్ పోలీసుల సంయుక్త బృందాలు సంఘటన స్థలం పరిసర ప్రాంతాల్లోని వందలాది గంటల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాయి. అనుమానాస్పద వాహనాల కదలికలు, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ వివరాలను విశ్లేషిస్తూ నిందితుల జాడను కనుగొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కుట్రలో భాగంగా మొదట నల్లగొండలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎంపిక చేసుకుని, సంఘటనకు ముందు అక్కడి పరిస్థితులను పరిశీలించి, దాడికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. జూన్ 6వ తేదీ తెల్లవారుజామున సుమారు 3:45 గంటల సమయంలో నిందితులు పాలకురి అశోక్ కుమార్ గౌడ్‌కు చెందిన బలెనో కారు నంబర్ TS07HT2430లో నల్లగొండకు చేరుకున్నారు. ముందస్తుగా తెచ్చుకున్న రెండు పాత బెడ్‌షీట్లను ఎన్టీఆర్ విగ్రహంపై కప్పి, ఒక లీటర్ పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన ద్వారా ప్రజల్లో ఆగ్రహం, ఆందోళన రేకెత్తించి ప్రజల మధ్య ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలనే కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితులైన పాలకురి అశోక్ కుమార్ గౌడ్ (45), ప్రైవేట్ లెక్చరర్, చైతన్యపురి, హైదరాబాద్ మరియు ఎలుకంటి ప్రణీత్ (23), ప్రైవేట్ ఉద్యోగి, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లాలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన బలెనో కారు మరియు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలను సైతం పోలీసులు విశ్లేషిస్తున్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. సామాజిక శాంతి, సామరస్యాలను దెబ్బతీసే కుట్రలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ కె. శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ ఎస్. రాఘవరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు డి. చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, రూరల్ ఎస్ఐ డి. సైదాబాబు, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, సీసీఎస్ సిబ్బంది పుష్పగిరి, శివరాజు, సాయి, నరేశ్, నాగార్జున, కమల్, టూ టౌన్ సిబ్బంది బాలకోటి, షకీల్, శంకర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.




## సమాజంలో అభద్రత భావం కల్పించే వారిపై కఠిన చర్యలు.

- **హద్దు దాటితే దండనే.**
- **నాన్ బెయిలబుల్ వారెంట్ తో జైలుకు పంపుతాం.**
- **సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్.**

**ఆశ్వి అప్డేట్స్ జూన్ 17:**

సూర్యాపేట జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ హెచ్చరించారు. సమాజంలో అభద్రతా భావాన్ని సృష్టించే వారిపై, ఇరు వర్గాల దాడులు, మద్యం మత్తులో దాడులకు పాల్పడే యువతపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాం, కఠిన చర్యలు తీసుకుంటాం అని ఆయన స్పష్టం చేశారు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ తో జైలుకు పంపడం, రౌడీ షీట్స్ నమోదు చేసి ప్రతి నెలా పోలీస్ స్టేషన్ కు పిచి కౌన్సిలింగ్ చేస్తాం. ప్రజలను ఇబ్బందులకు గురి చేసినా, సమాజంలో అభద్రతా వాతావరణం కల్పించిన అలాంటి వారిని ఉపేక్షించం, చట్టాన్ని ఉల్లంఘిస్తే కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సినదే అన్నారు. సందర్భాన్ని తీవ్రతను బట్టి ఫ్రెండ్లీ పోలీసింగ్ పక్కన బెట్టి చట్టానికి పని చెప్తాం అని హెచ్చరించారు. పాత నేరస్తులు, తీవ్రమైన కేసుల్లో ఉన్న నిందితుల పై నిఘా ఉన్నది ఎక్కడ తిరుగుతున్నారు అనేది పరిశీలించడానికి వ్యక్తిగత వివరాలు, ఫోన్స్ జియో టాగింగ్ చేసి ప్రత్యేక బీట్ బృందాలతో పర్యవేక్షణ చేస్తున్నాం. కాలనీల్లో రోడ్ల వెంట అడ్డాల చేసుకుని ఇబ్బందులు పెడుతున్న ఆకతాయిల సమాచారాన్ని ఫోటోలు, విడియోలు తీసి 8712686026కు పోలీసు వారికి సమాచారం ఇవ్వండి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# ఉస్మానియా మెడికల్ కాలేజీలో ర్యాగింగ్..!

- **పన్నెండు మందిపై కేసులు**

**ఆశ్వి అప్డేట్స్**

ఉస్మానియా మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది.!
బీడీఎస్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులను ర్యాగింగ్ చేశారనే ఆరోపణలపై ఫైనల్ ఇయర్కు చెందిన 12మంది విద్యార్థులపై కేసు నమోదైంది.
కాలేజ్ ప్రిన్సిపల్ సంజీవ్సంగ్ యాదవ్ ఫిర్యాదు మేరకు సుల్తాన్బజార్ పోలీసులు TG ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. కాలేజ్ యాజమాన్యం ర్యాగింగ్కు పాల్పడిన స్టూడెంటు 6నెలల పాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు, ఈ 12 మంది కాక ఇంకెవరి హస్తమైనా ఉందా అనే విషయం లోతు గా ఆరా తీస్తున్నారు



# సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- **ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ బి. అనురాధ ఐ.పి.యస్**

**ఆశ్వి అప్డేట్స్ క్రైమ్ బ్యూరో జూన్ 17:**




సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమని ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) డాక్టర్ బి. అనురాధ పేర్కొన్నారు. సమాజాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.
మంగళవారం రాత్రి నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ సురక్ష' అవగాహన కార్యక్రమానికి డీసీపీ డాక్టర్ బి. అనురాధ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
ఇటీవల నగరంలోని పలు అపార్ట్‌మెంట్లు, నివాస గృహాల్లో చోటుచేసుకుంటున్న చోరీలు, హత్యలు వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మే నెల నుంచి 'మీ సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, నివాస ప్రాంతాల్లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది, గృహ సహాయకులు, డ్రైవర్లు తదితర సేవకుల వివరాలను సేకరిస్తున్నామని వివరించారు.
ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఇప్పటివరకు ప్రజల సహకారంతో 2223మంది, పోలీసుల ద్వారా 9,940 మంది సేవకుల వివరాలను నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సమాచారంతో ఏదైనా నేర ఘటన జరిగినప్పుడు అనుమానితులను గుర్తించడం, దర్యాప్తు వేగవంతం చేయడం, నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు.
ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించిన డీసీపీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మహిళలపై వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలు లేదా అనుమానాస్పద వ్యక్తుల సంచారం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే సమాచారం నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.
ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని సూచించారు. సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.
ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ డీసీపీ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, నిర్లక్ష్యంగా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ తగిన జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు.
కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, పలువురు సీఐలు, ఎస్సైలు, షీ టీం సిబ్బంది, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, సురక్షితమైన, నేరరహిత సమాజ నిర్మాణం అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని డీసీపీ డాక్టర్ బి. అనురాధ స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో భద్రత, సైబర్ జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాల పట్ల చైతన్యం పెంపొందించడంలో ఉపయోగపడిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.



# నిష్పాక్షిక సంస్కరణా? రాజకీయ వివాదాలకా కేంద్రబిందువు?

## ప్రత్యేక ఓటరు సవరణపై దేశవ్యాప్తంగా చర్చ

దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మార్చడమే లక్ష్యమని ఎన్నికల సంఘం చెబుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం ఈ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ కార్యక్రమం వల్ల ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారంటూ ఆరోపిస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాల సంరక్షణ బాధ్యత ఎన్నికల సంఘానిదే. ప్రతి ఏడాది సాధారణ సవరణ ప్రక్రియ నిర్వహించినప్పటికీ, జనాభా మార్పులు, వలసలు, పట్టణీకరణ, ద్వంద్వ నమోదులు వంటి సమస్యల కారణంగా సమగ్ర ప్రక్షాళన అవసరమైందని ఎన్నికల సంఘం వివరిస్తోంది. ప్రస్తుతం దేశంలో నమోదిత ఓటర్ల సంఖ్య 100 కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల వ్యవస్థగా భారతదేశం నిలిచిన నేపథ్యంలో, ఓటరు జాబితాల ఖచ్చితత్వం అత్యంత కీలకమని అధికారులు చెబుతున్నారు. మరణించినవారి పేర్లు, ఒకే వ్యక్తికి బహుళ నమోదులు, తప్పుడు చిరునామాలతో ఉన్న నమోదులను గుర్తించి తొలగించేందుకు ఈ ప్రత్యేక సవరణ చేపట్టినట్లు వెల్లడించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తున్నారు. కొత్తగా అర్హులైన వారిని జాబితాలో చేర్చడం, తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా డ్రాఫ్ట్ జాబితాలు అందజేస్తున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ తదితర పార్టీలు ఈ ప్రక్రియపై సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, పట్టణ మురికివాడల ప్రజలు సరైన పత్రాలు సమర్పించలేక ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల ముందు భారీ స్థాయిలో ఓటరు జాబితాల ప్రక్షాళన చేపట్టడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నాయి. భారతీయ జనతా పార్టీతో పాటు అధికార కూటమి ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సమర్థిస్తోంది. బోగస్ ఓట్లు, ద్వంద్వ నమోదులు, అక్రమ ఓటింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి ఓటరు జాబితాల శుద్ధి అవసరమని చెబుతోంది. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని స్పష్టం చేస్తోంది.

ఓటరు జాబితాలపై వివాదాలు కొత్తవి కావు. 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, 2019 పశ్చిమ బెంగాల్ ఎన్నికలు, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా ఓట్ల తొలగింపుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కొంతమంది అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడం, మరోవైపు బోగస్ నమోదులపై విమర్శలు రావడం తరచూ జరుగుతూనే ఉంది. ప్రతి సవరణ ప్రక్రియలో కోట్లాది కొత్త ఓటర్లు నమోదవుతుండగా, అనర్హులైన లేదా మరణించిన వారి పేర్లు తొలగించబడుతున్నాయని ఎన్నికల సంఘం గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే ఏ ఒక్క అర్హుడి ఓటు హక్కు కూడా హరించబడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావాలంటే పూర్తి పారదర్శకత, ప్రజలకు విస్తృత అవగాహన, రాజకీయ పార్టీల సహకారం, పౌర సమాజ పర్యవేక్షణ అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే సంస్కరణగా నిలుస్తుందా, లేక రాజకీయ వివాదాలకే పరిమితమవుతుందా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

### రాజ్యాంగబద్ధ ప్రాధాన్యత - సంస్కరణల నేపథ్యం

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంపూర్ణమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం అని చెప్పక తప్పదు. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉంటే ప్రజాస్వామ్య పునాదులు అంతగా బలపడతాయి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం' (ఎస్ఐఆర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర రాజకీయ చర్చకు, మేధోమథనానికి దారితీసింది. అధికారికంగా ఇది ఓటరు జాబితాల్లోని దీర్ఘకాలిక లోపాలను సరిచేయడం, నకిలీ, అర్హతలేని ఓటర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడిని జాబితాలో చేర్చడం కోసం తలపెట్టిన బృహత్తర సంస్కరణగా ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అయితే, ప్రతిపక్షాలు మాత్రం దీనిని ఎన్నికల ముంగిట అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా, ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లను గైర్హాజరు చేసేందుకు ఉద్దేశించిన రాజకీయ ప్రేరిత చర్యగా తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ భిన్న దృక్పథాల నేపథ్యంలో ఎస్ఐఆర్ సాధ్యాసాధ్యాలను, దాని పూర్వాపరాలను, చారిత్రక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరముంది.

# 30లోగా కేవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

## పూర్తి చేయకుంటే గ్యాస్ సబ్సిడీ కట్!

### గ్యాస్ వినియోగదారులకు కేంద్రం మెలిక



**న్యూఢిల్లీ, జూన్ 17:** వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్దిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ పక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ-కేవైసీ పక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ పక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ. 29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ పక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ పక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ పక్రియను పూర్తి చేస్తున్నాయి.

# అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర

■ ముందే పసిగట్టి అడ్డుకున్న ఇంటిలిజెన్స్

**వాషింగ్టన్, జూన్ 17:** అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడి చేసేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ భగ్నం చేసింది. డొనాల్డ్ ట్రంప్ 80వ పుట్టిన రోజు సందర్భంగా వైట్‌హౌస్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, స్నైపర్లతో దాడి చేయాలని కొందరు వ్యక్తులు పన్నిన కుట్రను అధికారులు ముందుగానే గుర్తించి అడ్డుకున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. నిందితులు ఐదుగురిలో ఒకరైన 19 ఏళ్ల ట్రైసెన్ ప్రాపర్ తల్లి ఇచ్చిన సమాచారంతోనే ఎఫ్‌బీఐ ఈ కుట్రను భగ్నం చేసింది. గూఢచర్యం, భారీగా ఆయుధాలు కొనుగోలు చేయడం, హిట్ అండ్ రన్ మిషన్ల గురించి కొందరితో అతడు మాట్లాడుతుండడాన్ని ఆమె గమనించి అనుమానించింది. వెంటనే ఆమె స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎఫ్‌బీఐ అప్రమత్తమై నిందితులను అదుపులోకి తీసుకుంది. ఎఫ్‌బీఐ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. నిందితులు పేలుడు పదార్థాలు అమర్చిన డ్రోన్లతో వైట్‌హౌస్ సమీపంలోని భవనాలపై దాడి చేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలనుకున్నారు. అనంతరం బయటకు పరుగులు తీసే ప్రజలపై స్నైపర్లతో కాల్పులు జరపాలనుకున్నారు. కొందరు నిందితులు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా ప్రణాళికలు రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ దీనిని ఒక పెద్ద ఉగ్రదాడి కుట్రగా అభివర్ణించారు. సరైన సమయంలో చర్యలు తీసుకోకపోయి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించేదని పేర్కొన్నారు. ఈ బృందంలోని వ్యక్తులకు ఒకరితో ఒకరికి సంబంధం లేదని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. వీరంతా ప్రభుత్వ వ్యతిరేకులని, లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ÷ళ్లపై ట్రంప్ యంత్రాంగం తీరుతో నిరాశ చెందిన వారిని, యూదు వ్యతిరేకులని పేర్కొన్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన వారిపై అధికారులు పలు కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.





# సైబర్ నేరస్థులు 'పరాన్నజీవులు'..

## సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 16:** సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, సదరు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ఐఎస్ఐ ఉగ్ర ముఠా గుట్టురట్టు

## ఏడుగురు అరెస్ట్..

### పుల్వామా తరహా కుట్ర కోణంలో దర్యాప్తు



**న్యూఢిల్లీ, జూన్ 16:** పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఉగ్ర ముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అరెస్టైన వారిలో ఆరుగురు ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. దర్యాప్తులో భాగంగా గాజియాబాద్‌కు చెందిన నలుగురు నిందితులు గతంలో జమ్మూ-కశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సేకరించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు పంపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుల్వామా తరహాలో మరో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నారా అనే కోణంలో భద్రతా సంస్థలు విచారణ జరుపుతున్నాయి. నిందితులు ఢిల్లీ నుంచి జమ్మూ వరకు ఉన్న కీలక రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి భారత సైనికుల కదలికలను గమనించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీలోని కాంట్ రైల్వే స్టేషన్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ వద్ద ఇటువంటి కెమెరాలు అమర్చినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. భారతీయ మొబైల్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశాల్లో ఉన్న వ్యక్తులకు చేరవేస్తూ వాట్సాప్, ఇతర సోషల్ మీడియా ఖాతాల నిర్వహణకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు ఒక్కో లావాదేవీకి రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. సిమ్ కార్డుల చోరీ, ఇప్పటికే యాక్టివేట్ చేసిన సిమ్‌ల కొనుగోలు వంటి అక్రమ మార్గాలను నిందితులు వినియోగించినట్లు తేలింది. ఆర్థిక లావాదేవీలను తమ ఖాతాల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో నిర్వహిస్తూ పోలీసుల కళ్లుగప్పేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై కూడా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఉగ్ర నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు కొనసాగిస్తామని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.



# నటి మృతి కేసులో కొత్త మలుపు..

## వైరల్ అవుతున్న చాట్‌లు



సినీ, టెలివిజన్ రంగాల్లో నటిగా గుర్తింపు తెచ్చుకున్న సంచితా ఉగలే అనుమానాస్పద మృతి కేసులో కొత్త పరిణామాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె మరణానికి ముందు జరిగినట్లు చెబుతున్న కొన్ని వ్యక్తిగత సందేశాలు బయటకు రావడంతో కేసు దర్యాప్తు మరింత ఆసక్తికరంగా మారింది. చిన్న వయసులోనే సినీ రంగంలో స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్న సంచితా, కొంతకాలంగా మానసిక ఒత్తిడి, ఆందోళన సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కూడా పొందుతున్నట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. అయితే ఇటీవల ఆమె తన నివాసంలో ప్రాణాలు తీసుకోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సంచితా మరణం అనంతరం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినీ పరిశ్రమలో ఎదురైన ఒత్తిళ్లు, అవకాశాల కోసం జరిగిన పోరాటం ఆమె మానసిక స్థితిపై ప్రభావం చూపి ఉండవచ్చని సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, తన కుమార్తె మరణంపై అనేక సందేహాలు ఉన్నాయని ఆమె తండ్రి పేర్కొన్నట్లు సమాచారం. కొందరి వేధింపులు, నిరంతర ఒత్తిడి ఆమెను తీవ్రంగా కలిచివేసి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, సంచితా మరియు ఆమె మానసిక వైద్యుడి మధ్య జరిగినట్లు ప్రచారంలో ఉన్న సందేశాల చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వాటి ప్రకారం ఆమె భవిష్యత్తుపై ఆందోళన, ఆత్మవిశ్వాస లోపం, వృత్తిపరమైన ఒత్తిడితో బాధపడుతున్నట్లు కనిపిస్తోందని వార్తలు వెలువడుతున్నాయి. షూటింగ్ సమయంలో సంభాషణలు గుర్తుంచుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మునుపటి మాదిరిగా పని చేయలేకపోతున్నానని ఆమె పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సందేశాల ప్రామాణికతపై ఇప్పటివరకు అధికారిక ధృవీకరణ లేదు. దర్యాప్తు సంస్థలు అన్ని కోణాల్లో కేసును పరిశీలిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న సమాచారం నిజానిజాలపై అధికారిక వివరాలు వెలువడే వరకు వేచి చూడాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. సంచితా మృతి ఘటన సినీ రంగంలో మానసిక ఆరోగ్యం, వృత్తిపరమైన ఒత్తిళ్లపై మరోసారి చర్చకు దారితీసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఆల్ఫా ట్రైలర్ విడుదల

యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# పెద్ది నుంచి చికిరి చికిరి ఫుల్ సాంగ్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'పెద్ది' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'చికిరి చికిరి' అనే పాటకి సంబంధించిన ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్, జాన్వీ గ్లామర్, మాస్ కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచాయి. చరణ్ రగ్డ్ లుక్‌లో, ఊర మాస్ స్టెప్పులతో ఇరగదీయగా, జాన్వీ కపూర్ ట్రెడిషనల్ అవుట్‌షిట్‌లో కుర్రకారు మతులు పోగొడుతోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.



# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బడ్జెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in